కాళోజీ సేవలు చిరస్మరణీయం.. ఎంపీడీవో గుండె బాబు



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

తెలంగాణ దిక్కారస్వరం, ప్రజా కవి కాళోజీ జయంతి..



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 256 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 10 సెప్టెంబర్ 2026



2లో

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో

# కుట్ర..

బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు

స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు

ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం

అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ

కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు



హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, మిగతా2లో...



## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్టానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మిగతా2లో...

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన

15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన



2లో

## స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. నోటీసు ఎలా ఇస్తారు?

- గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



2లో

## గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

● పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు ● కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ ● 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ● రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం ● మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు: కేటీఆర్



హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు మిగతా2లో...




## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

- రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మిగతా2లో...

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్



హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం మిగతా2లో...

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ

# రద్దు చేయం

● ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్ ● రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు ● సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం.. ● శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం



2లో

## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్

తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన

మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి

అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్మాత్మక లి“తెలంగాణ రైజింగ్ సమ్మిట్”లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ మిగతా2లో...



# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు.

# గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

(మొదటి పేజీ తరువాయి)

బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శిం చారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలం టున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి.

పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**అమరావతి,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..నోటీసు ఎలా ఇస్తారు?

**హైదరాబాద్:సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**
జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిం చారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్-కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ.2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు.తెలంగాణకు సంబం ధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇది ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు.కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలం టీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, e-POS సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# తెలంగాణ ధిక్కారస్వరం, ప్రజా కవి కాళోజి జయంతి..

**హనుమకొండ : సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** కళాశాల( స్వయం) లో ప్రజా కవి కాళోజి జయంతి కళాశాల తెలుగు విభాగం తరపున ఘనంగా నిర్వహించబడింది. ఈనాటి సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ గారు అధ్యక్షత వహించారు. కాళోజి చిత్రపటానికి పుష్పమాల అలంకరణ చేసి కాళోజీ వ్యక్తిత్వాన్ని, సాహిత్య సేవను, కాళోజి కవిత్వంలో ప్రతిబింబించే తెలంగాణ సమాజాన్ని, ఆనాటి సామాజిక విశేషాలను అభివర్ణించారు. కాళోజి జీవితం సమాజ సేవకే అంకితం. ఆనాటి నిజాం ప్రభుత్వ దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, రజాకార్ల దుర్మార్గాలపై నిన దించెను. నా భాష" బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష " అని సగర్వంగా చెప్పుకొనెను. తెలంగాణ భాష ఔన్న త్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చెను. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు చాలా విలువైనది, ఆ ఓటును సారా,కూరా బేరాలకు కాకుండా సరియైన నాయకునికి ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తపించెను. అభ్యర్థి ఏ



పార్టీ వాడో కాదు, ఏపాటివాడో చూడాలని చెప్పెను. " అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి, అన్యాయాన్ని ఎదిరించేవాడు నాకు ఆరాధ్యుడు అని " సమాజంలో గల అన్యాయాన్ని ఎదిరించమని పిలుపునిచ్చెను. సామాజిక దోపిడీని కూడా నిరసించెను. ప్రాంతం వాడు దోపిడీ చేస్తే పాతరేస్తామని, ప్రాంతేతరుడు దోపిడీ చేస్తే ప్రాంతం దాకా తన్ని తరుముతామని చెప్పాను. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాను. " తెలంగాణ వేరైతే దేశానికి ఆపత్తా, తెలంగాణ వేరైతే





పాకాలా, లక్నవరం పారుదలలు ఆగుతాయా " అని వ్యంగంగా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను చెప్పెను." పుట్టుక నీది చావు నీది, బ్రతుకంతా దేశానిది " అని జయప్రకాశ్ నారాయణ గురించి కాళోజి చెప్పిన మాటలు, కాళోజి జీవితానికి పూర్తిగా అన్వయింపబడు తున్నవి. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా లెంక సత్యనారాయణ, సీనియర్ అధ్యాపకులు ఎం సమతా, జె రమేష్, జి మహేందర్, బి సీతారాం, పి శ్రీనివాస్, సిహెచ్ మాలతీలత పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ తాజా వివరాలు రాజకీయ పార్టీలకు వెల్లడించాలి

### పోలింగ్ కేంద్రాల వారీగా దావాలు, అభ్యంతరాల జాబితాల అందజేత

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా సెప్టెంబర్09(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2026కు సంబంధించిన తాజా వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని మినీ సమావేశ మందిరంలో 109ములుగు ఎస్టీ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చేపడుతున్న ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్‌ను అక్టోబర్ 19 నుంచి నవంబర్ 9 వరకు పొడిగించిన నేపథ్యంలో, సవరించిన షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు అందిన దావాలు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారాలు9, 10, 11 జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందిన దావాలు, అభ్యంతరాలు, ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వాటి ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరాలను సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 286 గ్రాముల గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

**పరకాల, సెప్టెంబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో 286 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 8న పరకాల ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ పవన్ సిబ్బందితో కలిసి భూపాలపల్లి రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోయేందుకు యత్నించిన గోపిశెట్టి రాజేశ్ (22), పెయింటర్, కాకినాడను అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో తనిఖీ చేయగా 286 గ్రాముల గంజాయి లభించింది. దీని



విలువ సుమారు రూ. 14,150 ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితో పాటు ఒప్పో ఏ3ఎక్స్ 5జీ సెల్‌ఫోన్, నల్ల బ్యాగు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడకు చెందిన సత్తిబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసి, చెల్పూర్‌లో పరిచయమైన రంజిత్‌కు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రాజేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

# ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫర్ వేస్ట్ వాటర్ టెక్నాలజీ

### - ఇండియా2026లో పాల్గొననున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్

**హన్మకొండ సెప్టెంబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న 13వ (ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫర్ వేస్ట్ వాటర్ టెక్నాలజీ) ఇండియా 2026లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ.వెంకన్న పాల్గొననున్నారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన మున్సిపల్ కమిషనర్లు,సీనియర్ అధికారులతో కూడిన ప్రతినిధి బృందంలో భాగంగా కమిషనర్ వెంకన్న ఈ



కార్యక్రమానికి హాజరుకానున్నారు. పట్టణ నీటి నిర్వహణ,మురుగునీటి శుద్ధి,ఘన వ్యర్థాల నిర్వహణ,రీసైక్లింగ్, బయోగ్యాస్,ఈ-వేస్ట్ తదితర ఆధునిక పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రదర్శనలు,సాంకేతిక సమావేశాలు,నిపుణులతో చర్చలు,జ్ఞాన మార్పిడి కార్యక్రమాల్లో కమిషనర్ వెంకన్న పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు,ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి వరంగల్ నగరంలో పారిశుధ్యం,ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఉపయోగపడనున్నాయి.

# కాళోజీ సేవలు చిరస్మరణీయం.. ఎంపీడీవో గుండె బాబు



**కమలాపూర్, సెప్టెంబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఎంపీడీవో గుండె బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో గుండె బాబు మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం తన కలంతో నిరంతరం పోరాడిన మహనీయుడు కాళోజీ అని అన్నారు. నిజాం పాలనలోని అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజల్లో చైతన్యం నింపారని తెలిపారు. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన రచనల ద్వారా గళమెత్తారని పేర్కొన్నారు. కవితలు, వ్యాసాల ద్వారా ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చినందుకే ఆయనను ప్రజాకవిగా గౌరవిస్తారని అన్నారు. కాళోజీ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో చేతన్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ కరణ్‌సింగ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీవీబీజీ రాంజీ, మండల ఏపీవో ఎన్.రమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**పరకాల, సెప్టెంబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. సంతోష్‌కుమార్ హాజరై కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పెన్నునే గన్నుగా మలిచి ప్రజలకు అండగా నిలిచిన మహోన్నత ప్రజాకవి కాళోజి అని కొనియాడారు. తెలుగు విభాగం అధ్యాపకులు రేణ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కాళోజి సేవలు చిరస్మరణీయమన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ భాషకు గతంలో తగిన గౌరవం దక్కలేదని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత భాషకు గుర్తింపు పెరిగిందన్నారు. మన మాతృభాషను మాట్లాడినప్పుడే దాని గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రామకృష్ణ కాళోజి తెలంగాణ మాండలికానికి పట్టం కట్టిన గొప్ప మేధావి అన్నారు. స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎ. అశోక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ అన్నెం శ్రీనివాస్‌రెడ్డి కాళోజి సాహిత్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన మహానాయకుడు కేసీఆర్

### - బీఆర్ఎస్ నాయకులు రేణుకుంట్ల సురేష్




**ములుగు, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలను 100% గ్రాంట్ కింద అందించే చారిత్రాత్మక దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చిన మహానాయకుడు కేసీఆర్ గారేనని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా దళిత నాయకులు రేణుకుంట్ల సురేష్ అన్నారు. దళితుల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వ్యతిరేకి అని ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నా కేసీఆర్ గారికి దళితుల మీద ఉన్న ప్రేమ తెలంగాణలో ఏ నాయకుడికి లేదని అన్నారు. దళితుడు ఎవరి మీదా ఆధారపడకూడదు, తన కాళ్లపై తాను నిలబడాలనే లక్ష్యంతో అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా దళితుల చేతికి ఆర్థిక బలాన్ని అందించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దళితుల సంక్షేమానికి బాట వేసిన నాయకత్వం, ఆత్మగౌరవానికి అండగా నిలిచిన నాయకత్వం కేసీఆర్ గారిదేనని తెలిపారు.

## కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**• మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు**



**మల్లంపల్లి, సెప్టెంబర్ 9:( పి సి డబ్ల్యూ న్యూస్):** ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు అన్నారు.కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవితల ద్వారా సమాజం దృష్టికి తీసుకువచ్చిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని అన్నారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచి, అన్యాయం, అక్రమాలు, అణచివేతకు వ్యతిరేకంగా తన కలాన్ని అక్షరాయుధంగా మలిచారని పేర్కొన్నారు.తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని గోల్కొండ రాజు అన్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సముచిత గౌరవమని తెలిపారు.మల్లంపల్లి ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం కూడా ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కాళోజీ స్ఫూర్తితో ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి**



**ములుగు జిల్లా సెప్టెంబర్09(పిసిడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు.బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు.ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మల్లంపల్లి మండల ప్రత్యేక సమావేశం విజయవంతం




**మల్లంపల్లి, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**మల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేక సమావేశం జరిగింది. మండల ప్రత్యేక అధికారి ఎస్. కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ములుగు ఆత్మా చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 9 గ్రామ పంచాయతీల సర్పంచులు, 25 శాఖల అధికారులు హాజరయ్యారు.ప్రభుత్వ నిబంధ నల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి మండల ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, ప్రతి శాఖ అధికారి తమ శాఖ నివేదికను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని కోరారు.సమావేశంలో పలు ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. మండలంలోని పెద్ద చెరువులకు దేవాదుల ప్రాజెక్టు నీటిని నింపేందుకు చర్యలు చేపట్టాలని, శ్రీనగర్ గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా లేకపోవడంతో వెంటనే పైప్ లైన్ పొడిగించి బోరు వేయాలని నిర్ణయించారు. అలాగే గాన్ పల్లి, శ్రీనగర్ వద్ద జాతీయ రహదారిపై లింక్ రోడ్ల వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఉప సర్పంచ్లు చెక్ పవర్ రద్దు చేయాలి... కలెక్టరేట్ ముట్టడించిన 130 మంది సర్పంచులు




**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 9:( పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం సర్పంచుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం జరిగింది. జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ ముప్పేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని 9 మండలాలకు చెందిన సుమారు 130 మంది సర్పంచులు ఏకతాటిపైకి వచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్ ను వెంటనే రద్దు చేసి గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచుల అధికారాలను బలోపేతం చేయాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలంటే సర్పంచులకు పూర్తి బాధ్యతతో పాటు తగిన అధికారాలు ఉండాలని ఫోరం స్పష్టం చేసింది. ఈ సమస్యను త్వరలో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కుమార్ గౌడ్ తెలిపారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

**మొర్రిరాజుయాదవ్ బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్అధ్యక్షుడు**



**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు మల్లంపల్లి మండల కేంద్రంలో రైతు సమస్యల పైన అగ్రికల్చర్ ఏవో గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన ఎరువుల యాప్ ద్వారా రైతులు మందు బస్తాలు కొనడం కోసం అనేక ఇబ్బందులు పడడం జరుగుతుందని ఎరువుల కోసం రైతులు ఫర్టిలైజర్ షాపులు మరియు ఏవో ఆఫీసులచుట్టూ పడికాపులు కాస్తున్నారని ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవడం కాకుండా పాత పద్ధతిలోనే ఎరువులు కొనుక్కునే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రభుత్వాలు తీసుకువచ్చింది ఎరువుల యాప్ తీసేయాలని రైతే రాజు అని చెప్పేఈప్రభుత్వాలు ఈరోజు రైతును వ్యవసాయానికి దూరం చేసే కుట్రలు జరుగుతున్నట్టు అనిపిస్తుందని అన్నారు. అదేవిధంగా రైతులకు ఏదైనా అనుకోని సంఘటన జరిగి మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా చేయూత కోసం తీసుకొచ్చిన పథకమే రైతు బీమా అని రైతు భీమాను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల అవలంబిస్తున్న విధానాలు చాలా దుర్మార్గమని మొర్రి రాజు యాదవ్ అన్నాడు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి వార్డ్ మెంబర్ ఎండి పాషా, యువజన విభాగం నాయకుడు కుక్కల సంపత్, రైతులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**కల్లూరు, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాకవి, ప్రముఖ సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, ప్రజాస్వామ్య విలువలను సమాజం ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాళోజీ నారాయణరావు సాహిత్యం ప్రజల్లో చైతన్యం, సామాజిక బాధ్యత, న్యాయం పట్ల అవగాహన కలిగించిందని, ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు కు ఘన నివాళులు అర్పించారు.

# కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు





**సత్తుపల్లి, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సత్తుపల్లి బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆయన చావు కోరుకున్నారని ఆరోపిస్తూ సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై ఫిర్యాదు చేశారు. వెంటనే శంకర్‌ను అరెస్ట్ చేసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ మాట్లాడుతూ కేసీఆర్ జోలికి వస్తే ఏ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కూడా సహించబోరని హెచ్చరించారు. ప్రశాంతమైన తెలంగాణలో ఇలాంటి విష సంస్కృతి మంచిది కాదని అన్నారు. రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే ఇలాంటి వ్యాఖ్యలు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎల్లకాలం అధికారం మీది కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేస్తూ ఈ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్..





**- క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతుంది: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, ముఖ్యంగా బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్ కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రగ్బీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన మేయర్.. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియాఅస్మిత వంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మేయర్ తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను గుర్తించి వారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియాఅస్మిత వంటి కార్యక్రమాలను యువ క్రీడాకారులు, ముఖ్యంగా బాలికలు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని మేయర్ ఆకాంక్షించారు.కరీంనగర్ జిల్లాలో రగ్బీ క్రీడ అభివృద్ధికి రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా చేస్తున్న కృషిని మేయర్ అభినందించారు. ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదిక లభిస్తుందని అన్నారు.ఈ టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ, సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు, జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్, వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషబాబు తదితరులు పాల్గొన్నారు.

# కూలీ తల్లి బిడ్డకు డాక్టరేట్!



**పేపర్‌బాయ నుండి డాక్టరేట్ వరకు..**

**పేదరికాన్ని జయించి ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ**

**ఉద్యమాల గడ్డపై ప్రశ్నించే గొంతుక..**

**ఉద్యోగం కంటే ప్రజా ఉద్యమానికే ప్రాధాన్యం**

**దళిత, బహుజన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నత విద్య**


**లాఠీ దెబ్బలు.. కేసులు.. దాడులు హత్యాయత్నాలు అయినా వెనకడుగు వేయని నైజం!**

**గల్లీ నుంచి ఢిల్లీ దాకా సమస్యలపై పోరాటం**

**రిజర్వేషన్లపై పరిశోధనతో డాక్టరేట్ సాధించిన పాల్వాయి నగేష్**

**కష్టాలను జయించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ప్రస్థానం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేదరికం కుటుంబ బాధ్యతలు.. కూలీ పనులు.. పేపర్లు వేసిన రోజులు.. మరోవైపు ప్రజా సమస్యలపై పోరాటం.. ఇవేవీ ఆయన లక్ష్యానికి అడ్డుకాలేదు. తెల్లవారుజామున పేపర్‌బాయ్‌గా పనిచేస్తూనే చదువును కొనసాగించారు. భవన నిర్మాణ పనులకు, క్యాటరింగ్ పనులకు వెళ్లినా పుస్తకాన్ని మాత్రం వదల్లేదు. ఉద్యమాల్లో పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నా వెనక్కి తగ్గలేదు. ఉద్యోగ అవకాశం వచ్చినా ప్రజా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పేదరికం నుంచి మొదలైన ఈ ప్రస్థానం.. నేడు ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకునే స్థాయికి చేరాడు తుంగతుర్తికి చెందిన డా. పాల్వాయి నగేష్. **చిన్నతనం నుంచే చదువులో మేటి** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన పాల్వాయి ఎల్లయ్య రమనర్సమ్మ ల కుమారు డైనపాల్వాయి నగేష్ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరిచారు. ఏడో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అప్పటి జిల్లా కలెక్టర్ మనోహర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. **ప్రతిభ కు అండగా విద్యాసంస్థలు** ఆయన ప్రతిభను గుర్తించిన తుంగతుర్తిలోని విద్యారణ్య పబ్లిక్ స్కూల్ యాజమాన్యం పదో తరగతి వరకు ఉచిత విద్య అందించింది. పదో తరగతిలోనూ మండల స్థాయిలో టాప్ ర్యాంకర్లలో నిలిచారు.నగేష్ ప్రతిభను గుర్తించిన సూర్యాపేటలోని భవిత జూనియర్ కాలేజీ యాజమాన్యం రెండేళ్లపాటు ఉచిత విద్యతో పాటు భోజన వసతి కల్పించింది. ఇంటర్ బైపీసీలో 85 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలో తండ్రి పాల్వాయి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ భారం మొత్తం నగేష్‌పై పడింది. ఆర్థిక పరిస్థితులు మరింత దయనీయంగా మారాయి. ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చినా కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించే స్తోమత లేక కౌన్సెలింగ్ కేంద్రం నుంచే వెనుదిరగాల్సి వచ్చింది. **పొద్దున్నే పేపర్లు.. పగలంతా పనులు** చదువును కొనసాగించడంతో పాటు కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తెల్లవారుజామున పేపర్‌బాయ్‌గా పనిచేశారు. భవన నిర్మాణ రంగంలో మేస్త్రీ పనులు చేశారు. క్యాటరింగ్ పనులకు వెళ్లారు. కష్టాలు ఎన్ని ఎదురైనా చదువుపై మాత్రం రాజీపడలేదు. **ఓయూలో అడుగు.. ఉద్యమంలో దూకుడు** ఉన్నత చదువుల కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి ఎంఏ సోషియాలజీ పూర్తి చేశారు. ఓయూలో అడుగుపెట్టిన నాటి నుంచే మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మిలియన్ మార్చ్, సాగరహారం వంటి ఉద్యమాల్లో విద్యార్థులను సమీకరించారు. పోలీసుల లాఠీ దెబ్బలు, కేసులను ఎదుర్కొన్నారు. **ఉద్యోగం కంటే ఉద్యమమే మిన్న** 2012లో ఎస్ఐ ఉద్యోగ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసాడు. అయితే ఫిజికల్ ఈవెంట్స్‌కు ముందు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి సాయికుమార్ ఆత్మబలిదానం చేసుకున్నారు. అనంతరం జరిగిన ర్యాలీ ఉద్రిక్తతల్లో పోలీసుల దాడి లోనగేష్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మరుసటి రోజు జరగాల్సిన ఫిజికల్ ఈవెంట్స్‌కు చివరి అవకాశం కావడం తో హాజరు కాలేక ఉద్యోగావకాశాన్ని కోల్పోయారు.ఆ సమయంలో 'ఉద్యోగం నా ఒక్క కుటుంబం కోసమే.. ఉద్యమం యావత్ తెలంగాణప్రజల కోసం' అనే భావనతో ప్రభుత్వ ఉద్యోగం కంటే ప్రజా పోరాటాలే ప్రాధాన్యం అని నమ్మి నాటి నుండి నేటి వరకు ఒక్క ఉద్యోగానికి అప్లైకేషన్ కూడా పెట్టలే. **తెలంగాణ దళిత, బహుజన హక్కుల కోసం పోరాటం** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన పోరాటం కొనసాగించారు. దళితులు, బహుజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే విద్యే కీలకమని చెబుతూ వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రవ్యాప్త పాదయాత్రలో కీలక పాత్ర పోషించారు. 2017లో మాదిగ నవనిర్మాణ సమితిని స్థాపించి పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మందకృష్ణ మాదిగ అరెస్టును నిరసిస్తూ ఆయన విడుదల కోసం పాదయాత్ర చేపట్టారు. **ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటం** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను రాష్ట్రానికే పరిమితం చేయకుండా ఢిల్లీ వరకు తీసుకెళ్లారు. దళిత పరిశోధక విద్యార్థులకు రావాల్సిన ఫెలోషిప్‌లను నిబంధనల పేరుతో నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఫెలోషిప్‌లను నిరాకరిస్తున్న ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ దళిత పరిశోధక విద్యార్థుల తరఫున గళమెత్తారు. అదే సమయంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని స్థానిక సమస్యలపైనా పోరాటం కొనసాగించారు. 'దగాపడ్డ తుంగతుర్తి బిడ్డ తిరుగు యాత్ర' పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు. అంటే.. ఒకవైపు ఢిల్లీలో దళిత పరిశోధక విద్యార్థుల హక్కుల కోసం పోరాటం.. మరోవైపు సొంత ప్రాంతంలోని ప్రజా సమస్యలపై గల్లీ స్థాయిలో ఉద్యమం.. ఇలా 'ఢిల్లీ నుంచి గల్లీ దాకా' ఆయన పోరాటం సాగింది.అమరుడు మారోజు వీరన్న స్తూపాన్ని రోడ్డు విస్తరణ పేరుతో తొలగించే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ నగేష్ ఆమరణ నిరాహార దీక్షకు పిలుపు నివ్వడం తో ప్రభుత్వం దిగి వచ్చినది.ప్రజా సమస్యలపై గళమెత్తే క్రమంలో పలుమార్లు భౌతిక దాడులు, బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ాషె హ్ దీజ ఎఱఅశీతీఓఎ శ్రీఖ కోసం ఎన్నో పోరాటాలు చేస్తూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థిగా పోటీ చేశారు.**ప్రజా పోరాటంతో పాటు పరిశోధన** ప్రజా ఉద్యమాలతో పాటు విద్యను కూడా కొనసాగించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు.భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ' అనే అంశంపై సుదీర్ఘంగా పరిశోధన చేసి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది.**నేడు 'డాక్టర్'గా కొత్త మైలురాయి** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 8న నిర్వహించిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా పాల్గొనగ భారత్ బయోటిక్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఏం ఎల్ల, వైస్ చన్సులర్ కుమార్ మొలగరం చేతుల మీదుగా డా. పాల్వాయి నగేష్ అధికారికంగా పీహెచ్‌డీ పట్టాను అందించారు.కూలీ కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు.. పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ చదువును కొనసాగించి.. పేదరికాన్ని జయించి.. ప్రజా ఉద్యమాల్లో పోరాడుతూ.. దళిత, బహుజన హక్కుల కోసం గళమెత్తుతూ.. ఢిల్లీ నుంచి గల్లీ దాకా సమస్యలపై పోరాడి.. చివరకు రిజర్వేషన్ల వ్యవస్థపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం విశేషం.కష్టాలు వచ్చినా లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని నిరూపించిన డా. పాల్వాయి నగేష్ ప్రస్థానం.. పేద, మధ్యతరగతి యువతతో పాటు సామాజిక ఉద్యమాల్లో ఉన్న ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.




## బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలి



**హైదరాబాద్ సెప్టెంబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ లో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రెండు సంవత్సరాలు పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పిసిసి జనరల్ సెక్రెటరీ నాగభూషణం, కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, బొల్లు కిషన్, శ్రీకాంత్ నేత దిలీప్ కుమార్ నేత తదితరులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కేసీఆర్ చెడును కోరుకోలేదని, ప్రతిపక్ష నాయకుడిగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం తర్వాత అత్యధిక సెక్యూరిటీ పొందుతున్న వ్యక్తి కేసీఆరే" అని మహేశ్ గౌడ్ తెలిపారు. స్పీకర్ పదవి విషయంలో బీఆర్ఎస్ నేత తాతా మధు మాట్లాడిన తీరును ఖండించాలన్నారు. బీఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాన్ని యావత్ తెలంగాణ సమాజం ఖండిస్తోందని తెలిపారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు.

## తెలంగాణ భాషా యాసకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రజాకవి కాళోజీ: మేయర్ కొలగాని శ్రీనివాస్

**- కరీంనగర్‌లో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని రేకుర్తి 19వ డివిజన్‌లో ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవితాలను, వారి భావోద్వేగాలను, భాషా యాసను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహోన్నత ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, తెలంగాణ యాసలోని ప్రత్యేకతను తన సాహిత్యంతో ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కాళోజీ అని అన్నారు.సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, ప్రజా సమస్యలపై తన కలం ద్వారా నిరంతరం పోరాడిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కాళోజీ ఆలోచనలు, రచనలు, ప్రజాస్వామ్య విలువలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పిలుపునిచ్చారు.కాళోజీ నారాయణరావు వంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ అన్నారు. 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాళోజీ నగర్ కాలనీల అధ్యక్షులు రమణా రెడ్డి, నారాయణరెడ్డితో పాటు పలువురు డివిజన్ నాయకులు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కల్లూరులో 'ఖేలో ఇండియా' ఖో-ఖో ఎంపికలు బాలుర జట్టు ఖరారు



**కల్లూరు, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మినీ స్టేడియంలో ఖమ్మం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఖేలో ఇండియా' జిల్లా స్థాయి ఎంపిక పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలుర విభాగం ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి మొత్తం 123 మంది క్రీడాకారులు తరలివచ్చారు. 24 మంది పీడీలు, పీఈటీల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మందిని ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. **ఎంపికైన క్రీడాకారులు:** కొమరం చందుకిశోర్, తోలేం సాగర్, గుమ్మడి నిఖిల్ వర్మ, బత్తుల గణేష్, గంగాధరిని వివేక్, భూక్యా నరసింహారావు, ఈసం అజయ్ కుమార్, షైక్ జావీద్, ఊకె మధు చరణ్, తాటి సర్వేశ్వరరావు, మొక్కటి జస్వంత్, మెరుగు ఉపేంద్ర. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మువ్వా విజయ్ బాబు క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటేపల్లి కిరణ్, మట్టూరి జనార్దన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య, ప్రతినిధులు పి. నరసయ్య, ఎస్. రామారావు పాల్గొన్నారు. గురువారం ఉదయం 9:00 గంటలకు ఇదే వేదికపై బాలికల విభాగం ఎంపికలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పిసిడబ్ల్యూ న్యూస్ కథనానికి స్పందన.



**- బాబోయ్ ఈ హాస్టల్ తిండి మాకొద్దు అనే వార్తకు మండల విద్యాధికారి (ఎంఈఓ) బుచ్చయ్య సానుకూలంగా స్పందించారు.**

**- గుర్తుర్ బాలికల వసతిగృహం ఆదర్శ పాఠశాలను బుధవారం సందర్శించారు.**




**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో గల ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహం లోని పరిస్థితులు అధ్వాన్నంగా ఉండటంతో పి సి డబ్ల్యూ లో వచ్చిన వార్తకు స్పందిస్తూ బుధవారం తొర్రూరు మండలం ఎంఈఓ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు . ఎంఈఓ వచ్చిన సమయానికి హాస్టల్లో ఉండాల్సిన వార్డెన్ వ్యక్తిగత పనులపై సెలవు పై వెళ్ళారని తెలిపారు .అలాగే హాస్టల్లో ఉండాల్సిన స్వీపర్ కూడా అందుబాటులో లేరని వంట చేసే మహిళలు ఒక్కరు ఉండటంతో వసతి గృహంలోని పరిసరాలని తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలో పరిస్థితులను గమనించి అక్కడ ఉన్న పరిసరాలను పరిశీలించడంతో అన్ని వంట సామానుతో పాటు మిగతా వన్నీ సరిగ్గా లేకపోవడంతో వంట చేసే మహిళను మరోసారి ఇలాంటివి పరిస్థితులు ఉండకుండా కాకుండా చూసు కోవాలని పేర్కొన్నారు. వసతి గృహంలోని బాలికలు అప్పటికే వారు అక్కడ జరుగుతున్న క్రీడామైదానంలోకి వెళ్లిపోయారని తెలిపారు. వసతి గృహంలో ఉండాల్సిన వంట సామాను సరిగా లేకపోవడంతో మరోసారి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్ పై ఉన్నదని హాస్టల్లోని పరిస్థితులు ఇలాగే పునరావృత్తమైతే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించి వచ్చారు.

# కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**కల్లూరు, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. బుధవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి, నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలు మరియు



బాలలపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ రవాణా, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ,



కేసుల దర్యాప్తు నాణ్యత, సిబ్బంది విధుల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, రూరల్ సీఐ ముత్తు లింగయ్య, ఎస్సై డి హరిత పాల్గొన్నారు.

# హిజ్రాలు ఎవరినైనా వేధింపులకు గురి చేస్తే 112కి డయల్ చేయండి

**• తెలంగాణ డిజిపి ఆనంద్ కీలక సూచనలు**



**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తో సహా మిగతా పట్టణాలే కాకుండా పల్లె ప్రాంతాలలో కూడా ఈ మధ్యకాలంలో ఇజ్రాలు శుభకార్యాలలో వేధింపులకు గురి చేస్తున్నారని ఆ విషయం మా దృష్టికి రావడం జరిగిందని తెలిపారు. హైదరాబాదులో జరిగిన ఒక సంఘటనపై తెలంగాణ డిజిపి ఆనంద్ సానుకూలంగా స్పందిస్తూ ఎవరికైనా సరే హిజ్రాలు వేధింపులకు గురి చేస్తే 112 కు డయల్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. పోలీసులు సకాలంలో వచ్చి రక్షిస్తారని తెలిపారు. ఎవరికైనా సరే ఇలాంటి పరిస్థితి ఎదురైతే 112 కు కాల్ చేయాలని సూచించారు వేధింపులపై తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# కాళోజి బాటలో యువత పయనించాలి....

**•కొత్తూరు(సి)ఉపసర్పంచ్ పగడాల క్రిష్ణా రెడ్డి**



**మహబుబాబాదు ప్రతినిధి, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కురవి మండలం కొత్తూరు (సి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పగడాల క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తన రచనలు, కవితల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని, తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.ప్రజల సమస్యలను తన కలం ద్వారా ఎత్తిచూపుతూ సామాన్యుల గొంతుకగా నిలిచిన కాళోజి ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజి రచనలు సమాజంలోని అసమానతలను ప్రశ్నించడంతో పాటు ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించాయని, ఆయన చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త బాదావత్ సిరి నాయక్.ఫీల్డ్ అసిస్టెంట్ చిప్పరపల్లి మల్సూరు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు, వార్డు సభ్యులు కొంపెల్లి మల్లయ్య గౌడ్, బోక్క నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజి సేవలను, సాహిత్య కృషిని స్మరించుకున్నారు.

# వెంటిలేటర్‌పై మూడు వారాలు.. మిట్రాక్లిప్‌తో కొత్త ఊపిరి!

**•ఓపెన్-హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే అరుదైన చికిత్స.. • నాలుగు రోజుల్లోనే ఇంటికి చేరిన 60 ఏళ్ల హై-రిస్క్ పేషెంట్• యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ కళా జితేందర్ జైన్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గుండె కొట్టుకోవడం ఆగిపోకుండా ఉండటమే కాదు.. ఆ గుండెకు మళ్లీ ధైర్యం ఇవ్వడం కూడా వైద్య శాస్త్రం సాధించిన అద్భుతమే. గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ 60 ఏళ్ల పేషెంట్‌కు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో అరుదైన చికిత్స అందించి యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ వైద్య బృందం ప్రాణాలను కాపాడింది. మూడు వారాల పాటు వెంటిలేటర్‌పై చికిత్స పొందిన ఆయనకు ఓపెన్-హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే మినిమల్లీ ఇన్వాసివ్ మిట్రాక్లిప్ ప్రొసీజర్ విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో మరో కీలక మైలురాయిని నమోదు చేసింది.ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళా జితేందర్ జైన్ ఈ వివరాలను వెల్లడించారు.

**ప్రాణాలపై పట్టు బిగించిన గుండె సమస్య :** సదరు పేషెంట్ తీవ్రమైన మిట్రల్ రిగర్గిటేషన్ (ఎంఆర్)తో బాధపడుతున్నారు. గుండెలోని మిట్రల్ వాల్వ్ పూర్తిగా మూసుకోకపోవడంతో రక్తం వెనక్కి ప్రవహిస్తూ గుండెపై అధిక ఒత్తిడి ఏర్పడింది. ఫలితంగా ఆయనకు పదేపదే హార్ట్ ఫెయిల్యూర్ సమస్యలు ఎదురయ్యాయి. దీనికి తోడు ఊపిరితిత్తుల సమస్యలు తీవ్రం




కావడంతో పరిస్థితి మరింత విషమించింది.దాదాపు మూడు వారాల పాటు వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్న పేషెంట్‌కు సాధారణ ఓపెన్-హార్ట్ సర్జరీ చేయడం మరింత ప్రమాదకరమయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు మినిమల్లీ ఇన్వాసివ్ చికిత్సా విధానాన్ని ఎంచుకున్నారు.

**పెద్ద శస్త్రచికిత్స లేకుండానే.. గుండెకు ఉపశమనం :** ఓపెన్-హార్ట్ సర్జరీ చేయకుండానే మిట్రల్ వాల్వ్‌లోని లోపాన్ని తగ్గించే మిట్రాక్లిప్ ప్రొసీజర్‌ను డాక్టర్ కళా జితేందర్ జైన్ నేతృత్వంలోని కార్డియాలజీ బృందం విజయవంతంగా నిర్వహించింది. సీనియర్ కన్సల్టెంట్ క్లినికల్ అండ్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ డాక్టర్ వి. నాగార్జున మాటూరు నేతృత్వంలోని పల్మోనాలజీ, క్రిటికల్ కేర్ బృందం సమన్వయంతో ఈ క్లిష్టమైన చికిత్సను పూర్తి చేశారు.తీవ్రమైన గుండె సమస్యతో పాటు ఊపిరితిత్తుల సమస్యలు, సుదీర్ఘకాలం వెంటిలేటర్‌పై ఉండటం వంటి అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వైద్య బృందం సమన్వయంతో చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.

**నాలుగు రోజుల్లోనే ఇంటికి...** మిట్రాక్లిప్ చికిత్స అనంతరం పేషెంట్ ఆరోగ్య పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. గుండె పనితీరు మెరుగుపడటంతో పాటు శ్వాస సంబంధిత పరిస్థితి కూడా క్రమంగా స్థిరపడింది. చికిత్స జరిగిన కేవలం నాలుగు రోజులకే పేషెంట్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయడం ఈ చికిత్స విజయానికి నిదర్శనంగా నిలిచింది.“పేషెంట్ పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో పెద్ద శస్త్రచికిత్స చేయడం సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి హై-రిస్క్ పేషెంట్లకు మిట్రాక్లిప్ వంటి మినిమల్లీ ఇన్వాసివ్ విధానాలు ఒక మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. పెద్ద శస్త్రచికిత్స వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించడంతో పాటు పేషెంట్ త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది” అని డాక్టర్ కళా జితేందర్ జైన్ తెలిపారు.

**గుండెకు చికిత్స.. కుటుంబానికి భరోసా :** ఒక వైపు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి.. మరోవైపు ఆందోళనతో ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు.. ఇలాంటి సమయంలో అత్యాధునిక వైద్య పరిజ్ఞానం కేవలం ఒక చికిత్సా విధానం మాత్రమే కాదు.. ఒక కుటుంబానికి మళ్లీ ఆశను అందించే ప్రాణాధారంగా మారుతుంది. మిట్రాక్లిప్ చికిత్స విజయవంతం కావడంతో పేషెంట్ త్వరగా కోలుకుని ఇంటికి చేరడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది.కార్డియాలజీ, పల్మోనాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల మధ్య సమన్వయం, అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం కలయికతో అత్యంత క్లిష్టమైన హై-రిస్క్ గుండె పేషెంట్లకు సైతం మెరుగైన చికిత్స అందించవచ్చని ఈ కేసు మరోసారి నిరూపించింది.

**ఖమ్మంలోనూ అందుబాటులో వైద్య సేవలు :** ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ప్రతి నెల రెండో, నాలుగో బుధవారాల్లో తాను అందుబాటులో ఉంటానని డాక్టర్ కళా జితేందర్ జైన్ తెలిపారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులు నిపుణుల వైద్య సలహాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్లు డి. బాలరాజు, డి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

# దళిత బిడ్డల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగిన కేసీఆర్ - దళితులంటే అంత చిన్నచూపా

**•నోముల ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు**



**రామన్నపేట సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**నిన్న డప్పు చప్పుళ్లతో, ఆత్మగౌరవ నినాదాలతో కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు కదిలిన దళిత జాతి బిడ్డల పాదముద్రలను ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో పసుపు నీళ్లతో కడిగారనే వార్త రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజంలో ఆగ్రహ జ్వాలలు రేపుతోంది.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన దళిత వ్యతిరేక వ్యాఖ్యలకు నిరసనగా, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, కాంగ్రెస్ శ్రేణులు నిన్న ఎర్రవెల్లి ఫామ్ హౌస్ పైకి దండెత్తారు. పోలీసులు వారిని అడ్డుకున్నా, డప్పులతో, నినాదాలతో తమ ఆవేదనను వినిపించారు.అయితే ఆ దళిత బిడ్డలు వెనుదిరిగిన వెంటనే, వారి పాదముద్రలు పడిన చోట పసుపు నీళ్లతో కడిగినట్లుగా వస్తున్న వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది నిజమైతే ఇంతకంటే దారుణం, ఇంతకంటే అవమానం మరొకటి ఉండదని దళిత మేధావులు మండిపడుతున్నారు.తెలంగాణ తెచ్చింది దళితులమే, కొట్లాడింది మేమే అని చెప్పుకునే కేసీఆర్, దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చి, దళితబంధు పేరుతో మోసం చేసి, ఇప్పుడు ఏకంగా దళితుల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగే స్థాయికి దిగజారాడా అని ప్రశ్నిస్తున్నారు.ఇది కేవలం పసుపు నీళ్లతో కడగడం కాదు, తెలంగాణలోని 30 లక్షల దళిత కుటుంబాల ఆత్మగౌరవాన్ని కడిగేయడమేనని, దళితులంటే కేసీఆర్ కు ఎంత చిన్నచూపో ఈ ఘటనతో మరోసారి బయటపడిందని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై కేసీఆర్, కేటీఆర్ లు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీఎస్సీ సెల్ జిల్లా నాయకులు నోముల ప్రవీణ్ తెలిపినారు

# భక్తి, క్రమశిక్షణ, భద్రతతో గణపతి నవరాత్రులను జరుపుకోవాలి

**మహబూబాబాద్ సెప్టెంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి క్రమశిక్షణతో, భద్రతతో జరుపుకోవాలని పురపాలక సంఘ చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో పోలీసు శాఖ వారు నిర్వహించిన గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ముందస్తు జాగ్రత్తల గురించి ఈ యొక్క కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పురపాలక సంఘ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులందరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీస్ శాఖ సూచించింది. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ, విద్యుత్ తీగలు మరియు అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా మండపాల వద్ద అధిక శబ్దంతో డీజేలు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించకుండా నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం




కలగకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు అదేవిధంగా పోలీస్ శాఖ వారు నిరంతరం ఈ యొక్క మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక పర్యవేక్షణ ముమ్మరం చేస్తూ ఉండాలని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని దిశ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు డి.ఎస్.పి తిరుపతిరావు, సిఐ అంజలి,నా× లు వార్డుల కౌన్సిలర్లు, బొల్లు రాజు, నీరుటి లక్ష్మీ నారాయణ, చిదిరాల జ్ఞానేశ్వర్, పద్మం ప్రవీణ్, నిమ్మల శ్రీను, గణపతి ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు వైభవ్

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు . టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా . ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా



ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్ భారత్-ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

# బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం, శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన లోయర్ పరేల్ నివాసం నుంచి శిక్షణ కోసం ప్రతిరోజూ ప్రయాణించడం సమస్యగా మారడంతో హార్దిక్ ముంబై నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కేంద్ర కాంట్రాక్ట్ క్రికెటర్‌గా, గాయాల నిర్వహణ నుంచి నైపుణ్య శిక్షణ వరకు జూజులోని ప్రతి సదుపాయం అతనికి అందుబాటులో ఉంది. 'అందుకే, అతను ఐపీఎల్, రాష్ట్ర లేదా జాతీయ విధుల్లో లేనప్పుడు సీఓఈని తన శాశ్వత స్థావరంగా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.' అని ఆ వర్గాలు తెలిపాయి. సీఓఈ నిర్దేశిత కార్యక్రమాలకు వెలుపల, పాండ్యా తన సొంత ఫిజియోథెరపిస్ట్, వ్యక్తిగత స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో కలిసి పనిచేయనున్నాడు. వీరు అతని శిక్షణా దినచర్యలను పర్యవేక్షిస్తారు. 'అతను దేశం తరపున వైట్ బాల్ క్రికెట్ ఆడుతున్నంత కాలం తన స్థావరాన్ని బెంగళూరుకు మార్చుకున్నట్లే. అతను కనీసం మరో ఐదు, ఆరేళ్లపాటు ఆడాలని భావిస్తున్నాడు. సీఓఈ నియమించిన నెట్ బౌలర్లకు వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం వంటి నైపుణ్య శిక్షణ చేసినప్పుడు కూడా, హార్దిక్ వారికి తన సొంత జేబు నుంచే డబ్బు చెల్లిస్తాడు.' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా




వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు. 133 బంతుల్లో 56 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన తిలక్, శ్రేయాస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కౌనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉంది జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు




పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.



# యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం

- కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్
- అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్ చేతిలో ఓటమి



యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. డిఫెండింగ్ ఛాంపియన్ స్పానిష్ టెన్నిస్ స్టార్ కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్ తగిలింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన అతడిని బెన్ షెల్టన్ (అమెరికా) ఓడించాడు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్కరాస్‌పై బెన్ షెల్టన్ 6-7, 6-1, 6-3, 1-6, 7-6 (10-7) తేడాతో నెగ్గాడు. దీంతో ట్రోఫీని నిలబెట్టుకోవాలని భావించిన అల్కరాస్ ఊహించని ఈ ఓటమితో ఇంటిబాట పట్టాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ యాశ్ స్టేడియంలో జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్‌తో అల్కరాస్ తలపడ్డాడు. నాలుగు గంటలపాటు ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. గాయం తర్వాత నేరుగా ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన అస్కరాస్ తొలి రౌండ్‌లో అతి కష్టంమీద నెగ్గాడు. ఈ సెట్‌ను టై బ్రేక్‌లో గెలుచుకున్నాడు. అయితే తర్వాత రెండు సెట్లలో బెన్ షెల్టన్ జోరు ప్రదర్శించాడు. వరుసగా రెండు, మూడు సెట్లను 6-1, 6-3 తేడాతో గెలుచుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. పట్టు వదలని అల్కరాస్ నాలుగో సెట్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ 6-1తో సెట్‌ను గెలుచుకున్నాడు. ఇక నిర్ణయాత్మకమైన ఐదో సెట్ తీవ్ర ఉత్కంఠతకు దారి తీసింది. పోటీ హోరాహోరీగా సాగింది. ఈ ఇద్దరు 6- 6తో సమంగా నిలిచారు. దీంతో గేమ్ టై- బ్రేక్‌కు వెళ్లింది. అయితే టై- బ్రేక్‌లో షెల్టన్ 10-7తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా, అల్కరాజ్‌పై షెల్టన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. 23 ఏళ్ల అల్కరాస్ తమ కెరీర్‌లో ఎనిమిదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే ఆశతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టాడు. కానీ, ఈ ఓటమితో ఆ కల చెదిరిపోయింది. కాగా, అల్కరాస్ ఇప్పటిదాకా రెండుసార్లు (2022, 2025) ఖా ఓపెన్ టైటిల్ దక్కించుకున్నాడు. దీంతోపాటు ఒకసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ (2026), రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), రెండుసార్లు వింబుల్డన్ (2023, 2024) గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. మరోవైపు ఇంకో క్వార్టర్ ఫైనల్‌లో టియాఫో - మికెల్సన్ తలపడ్డారు. నాలుగున్నర గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మికెల్సన్‌పై 5-7, 3-6, 7-5, 6-3, 7-6 (10-6) తేడాతో టియాఫో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. ఇక సెమీఫైనల్‌లో ఫ్రాన్సెస్ టియాఫోతో షెల్టన్ తలపడనున్నాడు. 23 ఏళ్ల షెల్టన్ తన మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతను ఇప్పటివరకు మేజర్ గ్లాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గలేదు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2023 ఖా ఓపెన్ సెమీఫైనల్స్ వరకు వెళ్లడం అతడికి అత్యుత్తమ ప్రదర్శనలు. ఇదే టోర్నమెంట్‌లో రీసెంట్‌గా సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్‌కు తొలి రౌండ్‌లోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అతడిని మారియానో నావోన్ (అర్జెంటీనా) 7-6, 5-7, 6-4, 2-6, 6-1 తేడాతో ఓడించి సంచలనం సృష్టించాడు.




# ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా 'ఎపిక్'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. 'ఎపిక్' చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, 'ఎపిక్' తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, "ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు. దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. "నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు" అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు.

హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, "ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన 'కడలి' పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. 'ఎపిక్' సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# "ఒక్క మెతుకు పొలిమేర దాటదు"..

## 'రణబాలి'గా గర్జించిన విజయ్ దేవరకొండ..



రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి. 1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో 'రణబాలి' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# నాల్గవ హీరోను పరిచయం చేయనున్న శ్రీలీల..!



శ్రీలీల గత ఏడాది మూడు సినిమాలతో వచ్చింది. అందులో జూనియర్ కాస్త పర్వాలేదు అనిపించినా మిగిలిన సినిమాలు ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చాయి. దాంతో శ్రీలీల పని అయిపోయిందని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆరంభంలో పరాశక్తితోనూ ఫ్లాప్‌ను చవిచూసిన శ్రీలీలకి ఉస్తాద్ భగత్ సింగ్‌తో కాస్త ఊరట దక్కిందని చెప్పాలి. ప్రస్తుతం టాలీవుడ్‌లో శ్రీలీల చేస్తున్న సినిమాలు ఏంటి అంటే ఠక్కున చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆమె ఒకటి రెండు సినిమాలకు పరిశీలిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఆమె సినిమాను కన్ఫర్మ్ చేయలేదు. మరో వైపు బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో హీరోగా కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఈ సమయంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు తాజాగా ఆమెతో చర్చలు జరిపారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బాలకృష్ణ సూచన మేరకు మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మోక్షజ్ఞ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయిన విషయం తెల్సిందే. దాంతో హీరోయిన్ ను సైతం అదే స్థాయిలో బాలీవుడ్ నుంచి దించుతారని అంతా భావించారు. కానీ బాలకృష్ణ ఈ సినిమా కోసం శ్రీలీల అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో దర్శకుడు వశిష్ట లుక్ టెస్ట్‌కి రెడీ అయ్యాడని తెలుస్తోంది. మోక్షజ్ఞ, శ్రీలీలపై లుక్ టెస్ట్ చేయడంతో పాటు, కొన్ని సీన్స్ సైతం షూట్ చేసి పరిశీలించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. మోక్షజ్ఞ మొదటి సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తే అరుదైన రికార్డ్ ఆమె సొంతం అవుతుంది. ఇప్పటి వరకు ముగ్గురు హీరోలను శ్రీలీల ఇండస్ట్రీకి పరిచయం చేసింది. కన్నడ హీరో విరాట్ మొదటి సినిమా 'కిస్'. ఆ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల నటించింది. కిస్ హీరో విరాట్ కి, శ్రీలీలకు మొదటి సినిమా కావడం విశేషం. ఆ తర్వాత రోషన్ మేకా హీరోగా పరిచయం అయిన 'పెళ్లి సందడి' సినిమాలోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో శ్రీలీలకు అదే మొదటి సినిమా. రోషన్ మేకా మొదటి సినిమాకు శ్రీలీల సరైన జోడీ అనే అభిప్రాయంతో రాఘవేంద్ర రావు ఆమెను ఏరికోరి ఎంపిక చేశాడని అంటారు. ఆ తర్వాత కన్నడం నుంచి వచ్చిన కిరీటి రెడ్డి మొదటి సినిమా 'జూనియర్' లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఈ ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోగా నటించడం జరిగింది.

# మహేంద్రగిరి వారాహిని మురారితో పోల్చొద్దు: సుమంత్

డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన మహేంద్రగిరి వారాహి మూవీపై హీరో సుమంత్ ఫుల్ నమ్మకంతో ఉన్నారు. సినిమా ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇస్తుందని తెలిపారు. సుమంత్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమాకు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ నిర్మించగా, సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా ప్రమోషన్స్ లో భాగంగా సుమంత్ మీడియాతో మాట్లాడారు. మహేంద్రగిరి వారాహి తన కెరీర్ లో ఇటీవల వచ్చిన పెద్ద బడ్జెట్ సినిమాల్లో ఒకటని చెప్పారు. నిర్మాతలు మూవీని భారీ స్థాయిలో నిర్మించారని తెలిపారు. తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చిందని, ప్రేక్షకుల రెస్పాన్స్ చూసి సినిమాపై నమ్మకం మరింత పెరిగిందని అన్నారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కథను సింగిల్ సిట్టింగ్ లో చెప్పారని సుమంత్ తెలిపారు.



కథ మొత్తం తనకు నచ్చిందన్న ఆయన.. ముఖ్యంగా ఇంటర్వెల్, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు ఓ రేంజ్ లో నచ్చుతాయని అంచనా వేశారు. పురాణాలపై దర్శకుడికి మంచి అవగాహన ఉందని, అందుకే కథను ఆయన అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. వీఎఫ్ఎక్స్, క్యాస్టింగ్, యాక్షన్, థియేట్రికల్ ఎక్స్పీరియన్స్.. ఇలా అన్నీ సినిమాకు కలిసొచ్చాయని చెప్పారు. సినిమాలో తాను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ప్రశ్నించే వ్యక్తి పాత్రలో కనిపిస్తానని సుమంత్ వెల్లడించారు. అయితే తన రోల్ కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే చెప్పలేనన్న ఆయన.య డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండటంతో పాటు మంచి ఫ్యామిలీ డ్రామా, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఉన్నాయని చెప్పారు. సిద్దు జొన్నలగడ్డ సినిమాలో సీరియస్ రోల్ లో కనిపిస్తారని రివీల్ చేశారు. తమ మధ్య వచ్చే ఓ సీన్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని చెప్పారు. ఆ సీన్ చూసిన వారంతా చాలా బాగా వచ్చిందని చెప్పారని, సినిమాలో సిద్దు రోల్ బాగుంటుందని అన్నారు. ఆ రోల్ కు ఓకే చెప్పినందుకు సిద్ధుకు థ్యాంక్స్ చెప్పారు. ట్రైలర్ లో 33 ఏళ్లు దాటిన తర్వాత ఓ వంశానికి చెందిన వ్యక్తులు చనిపోతున్నట్లు చూపించడంతో మురారి సినిమా గుర్తుకొస్తుందని సుమంత్ చెప్పారు. అయితే రెండు సినిమాల స్టోరీ, స్క్రీన్ ప్లే పూర్తిగా వేర్వేరుగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. మహేంద్రగిరి వారాహి స్పెషల్ స్టోరీతో రూపొందిందన్న సుమంత్.. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు మెయిన్ స్ట్రెంత్ గా నిలుస్తుందని సుమంత్ చెప్పారు. కచ్చితంగా గూస్ బంప్స్ ఎక్స్పీరియన్స్ వస్తుందని అన్నారు. సినిమాలో మూడు మెయిన్ యాక్షన్ ఎపిసోడ్స్ తోపాటు మరికొన్ని యాక్షన్ బ్లాక్స్ ఉంటాయని తెలిపారు. వారాహి టైటిల్ స్టోరీ అనుకున్న సమయంలోనే రిజిస్టర్ చేశామని చెప్పిన ఆయన, పవన్ కల్యాణ్ వారాహి యాత్రతో ఆ పేరు పాపులర్ అయిందని చెప్పుకొచ్చారు.

# 'లస్ట్ స్టోరీస్ 3' ట్రైలర్ వచ్చేసింది.. ఈసారి మరింత బోల్డ్‌గా..




ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బోల్డ్ అంథాలజీ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాల్లోని సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ అల్లుకున్న ఈ కథలు గత భాగాల కన్నా మరింత బోల్డ్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ ఆంథాలజీలో నలుగురు ప్రముఖ దర్శకులు నాలుగు విభిన్నమైన లఘు చిత్రాలను తెరకెక్కించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ వంటి దిగ్గజ దర్శకులు తమదైన శైలిలో ఒక్కో కథను రూపొందించారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ వంటి ప్రముఖ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించారు. రియల్ లైఫ్ కపుల్ నటుడు సిద్ధార్థ్, అదితి రావు హైదరీ కొన్ని రొమాంటిక్ సీన్స్‌లో నటించారు. విభిన్నమైన కథనాలతో రాబోతున్న ఈ ఆంథాలజీ సిరీస్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.